www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 11 | ఫిబ్రవరి | 2026
పేజీలు : 8

## ప్రజల పక్షాన నిలిచే వారిని గెలిపించండి

**-కంకి కొడవలి గుర్తుకు ఓటేయండి**
**-సిపిఐ నేత బాగం**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజల పక్షాన నిలిచి సమస్యల పరిష్కారానికి పోరాడే వారిని గెలిపించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు కోరారు. బుధవారం జరిగే మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడే వారిని సిపిఐ బరిలో నిలిపిందని ఆయన తెలిపారు.ఏదులాపురం, వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీల తో పాటు కొత్తగూడెం కార్పోరేషన్, ఇల్లెందు, అశ్వారావుపేటలో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఎన్నికలంటే

మిగతా 2లో..

# నేడే మున్సిపోల్స్..!

**-ఏడు మున్సిపాలిటీలు**
**-కొత్తగూడెం కార్పోరేషన్‌లో ఎన్నికలు**
**-బరిలో 943 మంది**
**-పోలింగ్‌కు సర్వం సిద్ధం**







**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఖమ్మం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు ఒక కార్పోరేషన్‌కు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం, వైరా, మధిర, సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలకు, కొత్తగూడెం కార్పోరేషన్‌కు ఎన్నికలు జరగనున్నాయి. ఏదులాపురంలో 32 వార్డులకు గాను 45,256 మంది ఓటర్లు ఉండగా వైరాలో 20 వార్డులలో 24,689 మంది, మధిరలో 22 వార్డులకు గాను 25,679 మంది ఓటర్లు ఉన్నారు. సత్తుపల్లిలో 23 వార్డులకు గాను 28,830 మంది, కల్లూరులో 20 వార్డులకు గాను 18,866 మంది ఓటర్లు ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం కార్పోరేషన్‌లో

మిగతా 2లో..

## కార్పోరేషన్ సాధించిన వారికే పట్టం

**-కార్పోరేషన్ ఎన్నికల్లో కంకి కొడవలి వైపు ఓటరు మొగ్గు**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** కొత్తగూడెం కార్పోరేషన్‌కు తొలి సారి ఎన్నికలు జరగనున్నాయి. కార్పోరేషన్‌ను సాధించిన కమ్యూనిస్టు పార్టీకి కంకి కొడవలి గుర్తుపై నిలబడిన అభ్యర్థులకే కార్పోరేషన్ ఓటర్లు పట్టం కట్టబోతున్నారు. వివిధ సర్వేలు, జనాభిప్రాయ సేకరణలో ఇది తేటతెల్లమైనట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలో పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలతో పాటు సుజాతనగర్

మిగతా 2లో..

## ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోంది..

**-ఆధారాలు దొరకబడతాం**
**-సిపిఐ మిత్రపక్షమే : మంత్రి పొంగులేటి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలో ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని ఇందుకు బాధ్యులైన వారిపై ఉక్కుపాదం మోపక తప్పదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఆధారాలను సేకరించే పనిలో ఉన్నామని ఎక్కడ ఎక్కడ పరికరాలు అమర్చారో ఆరా తీస్తున్నామని ఆయన తెలిపారు. మంగళవారం పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసిన ఫోన్ ట్యాపింగ్‌నే ఇప్పుడు కూడా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్

మిగతా 2లో..

## వంచన చేసిన కాంగ్రెస్‌ను ఓడించండి

**-అభివృద్ధి చేసిన బిఆర్ఎస్‌కు పట్టం కట్టండి**
**-మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు వద్దిరాజు, తాతా మధు**

2లో



# నేడే మున్సి'పోల్స్'..!

(మొదటిపేజీ తరువాయి)

60 వార్డులకు గాను 134744 మంది ఓటర్లు ఉండగా ఇల్లందులో 24 వార్డులకు గాను 33,723 మంది ఓటర్లు, అశ్వారావుపేటలో 22 వార్డులకు గాను 36,850 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 943 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఖమ్మం జిల్లాలో 117 వార్డులకు గాను 414 మంది బరిలో ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం కార్పొరేషన్‌లో 60 డివిజన్లకు 354 మంది పోటీలో ఉండగా ఇల్లందులో 24 వార్డులకు 107 మంది, అశ్వారావుపేటలో 22 వార్డులకు 68 మంది రంగంలో ఉన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీలో 109 మంది, వైరాలో 80 మంది, సత్తుపల్లిలో 84 మంది, కల్లూరులో 71 మంది, మధిరలో 70 మంది పోటీలో ఉన్నారు. ఎన్నికలకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఎన్నికల అధికారులు సామగ్రితో ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎక్కడ ఎటువంటి అవాంతరాలు జరగకుండా ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఓటర్లకు కూడా ఇబ్బందులు కలగని రీతిలో ప్రశాంతంగా ఓటు వేసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. రెండు మున్సిపాలిటీలు, కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో పోలింగ్ నిర్వహ ణకు 288 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వీటిలో 94 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు గాను మొత్తం 241 మంది ప్రీసైడింగ్ అధికారులు, 723 మంది ఓపివోలను కేటాయిం చారు. ఇల్లందు మున్సిపాలిటీలో 62 మంది ఎన్ని కల అధికారులు 241 మంది సిబ్బందిని నియమిం చారు. అశ్వారావుపేటలో 42 మంది ఎన్నికల అధికారులు, 126 మంది సిబ్బందిని నియ మించినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఖమ్మంజిల్లాలో 117 వార్డులకు గాను 295 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఇందు కొరకు 295 మంది ఎన్నికల అధికారులు, 900 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా పోలింగ్ అనంతరం ఏదులాపురం మున్సిపాలిటీ బ్యాలెట్ బాక్స్‌లను ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలకు, కల్లూరు మున్సిపల్ బ్యాలెట్ బాక్స్‌లను ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు, మధిర మున్సిపాలిటీ బ్యాలెట్ బాక్స్‌లను పాలిటెక్నిక్ కళాశాల ఖాజీపురం, సత్తుపల్లి మున్సిపాలిటీ బ్యాలెట్ బాక్స్‌లను జ్యోతి నిలయం పాఠశాలకు, వైరా మున్సిపల్ బ్యాలెట్ బాక్స్‌లను వెటర్నరీ ఆసుపత్రికి తరలించనున్నారు. స్ట్రాంగ్ రూములను, లెక్కింపు కేంద్రాలను పైన పేర్కొన్న ప్రదేశాల్లో ఏర్పాటు చేశారు.



# కార్పొరేషన్ సాధించిన వారికే పట్టం

(మొదటిపేజీ తరువాయి)

మండలంలో నాలుగు డివిజన్లు ఉన్నాయి. పాల్వంచ పట్టణంలో మూడు దశాబ్దాలుగా ఎన్నికలు లేక పట్టణం అభివృద్ధికి నోచుకోలేదు. పారిశ్రామిక పట్టణం కావడం దేశంలోనే వివిధ రాష్ట్రాల ప్రజలు నివసించే పాల్వంచ అధికారుల పాలనలో గత కొంత కాలంగా నలిగిపోయింది. అవినీతి అధికారులు అభివృద్ధిని మరిచిపోవడం ప్రజాప్రతినిధులు లేకపోవడం పాల్వంచకు శాపంగా మారింది. ఈ దశలో 2023 ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి శాసనసభకు ఎన్నికైన సిపిఐ నేత కూనంనేని సాంబశివరావు ఎన్నికలు నిర్వహించడం ద్వారా పాల్వంచ అభివృద్ధికి శ్రీకారం చుట్టాలని భావించి కార్పొరేషన్ ఏర్పాటుకు వ్యూహ రచన చేశారు. ఇటు ప్రజా సంఘాలను, స్థానిక ప్రజలను కార్పొరేషన్ ఏర్పాటుకు ఒప్పించడంతో పాటు అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. మరో పక్క ప్రభుత్వంతో ఉన్న సన్నిహిత సంబంధాలను ఈ ప్రాంతాభివృద్ధికి వినియోగించుకుంటున్న కూనంనేని కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వాన్ని ఒప్పించేలా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉన్న సన్నిహిత సంబంధం కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుకు మార్గాన్ని సుగమం చేసింది. సాంబశివరావు కృషి లేకుంటే మరికొన్ని దశాబ్దాల పాటు పాల్వంచలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండేవి కావు. శాసన సభ్యునిగా సాంబశివరావు కార్పొరేషన్ ఏర్పాటుతో పాల్వంచ ప్రజలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఎంపిక చేసుకునే ఒక సువర్ణ అవకాశాన్ని కల్పించారు. సాంబశివరావు కృషిని పాల్వంచ ఓటర్లు అవగతం చేసుకున్నారు. మూడు దశాబ్దాలుగా ఎవరు చేయలేని పనిని చేసి చూపెట్టిన సిపిఐ అభ్యర్థులకే పట్టం కట్టాలన్న ఆలోచనతో ఉన్నారు. ఈ ఆలోచన కారణంగానే పాల్వంచలోని అన్ని డివిజన్లలో సిపిఐ అభ్యర్థులకు బ్రహ్మరథం పట్టేందుకు కారణమైంది. దీనికి తోడు తెలుగుదేశం ఇతర సామాజిక సంఘాలతో ఉన్న మిత్రత్వం వెరసి పాల్వంచలో అధిక స్థానాలు గెలుచుకునేందుకు మార్గం సుగమమైంది. ఇక కొత్తగూడెం పట్టణంలో సిపిఐ ఆది నుంచి కీలక శక్తిగా ఉంది. మహామహులు ఇక్కడ కమ్యూనిస్టుపార్టీని తక్కువ చేయాలని ప్రయత్నించిన అది సాధ్యం కాలేదు. అధికార హోదాలో అన్ని తామై వ్యవహరిస్తూ ప్రజలను బెదిరింపులకు గురిచేసి బయపెట్టిన నాడు సైతం ఇక్కడ కమ్యూనిస్టు పార్టీకి ప్రజలు పట్టం కట్టారు. ఇప్పుడు గత పోరాట చరిత్ర, చేసిన అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ చేసిన పోరాటాలు సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం అన్నింటికి మించి శాసనసభ్యునిగా కూనంనేని సాంబశివరావు చేస్తున్న అభివృద్ధి మరోసారి సిపిఐకి పట్టం కట్టేందుకు ఓటర్లు సిద్ధమయ్యేందుకు కారణమైంది. అధికార దానాహంకారంతో ఎవరు ఏమి చెప్పినా ఓటర్ల మదిలో కండ్ల ముందు కనపడుతున్న అభివృద్ధి, బాసటగా నిలిచిన ఘటనలు, చేసిన ప్రజా పోరాటాలే స్ఫూరణకు వస్తున్నాయి. ఇది బ్యాలెట్ రూపంలో మరోసారి మున్సిపల్ ఎన్నికల్లో సాక్ష్యత్కరించనుంది. ప్రజలకు అందుబాటులో ఉండటం, తనను గెలిపించిన ఓటర్ల రుణం తీర్చుకునేందుకు రాత్రిభవళ్లు శ్రమించడం అధికార ప్రజాప్రతినిధులు సైతం సాధిచంలేని రీతిలో నిధులు సాధించడం, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ మొదలు అనేక అభివృద్ధి పనులు సాంబశివరావును ఓటర్ల మదిలో అభివృద్ధికాముకునిగా నిలిపాయి. ఆందోళనకారునిగా ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీ పడని వ్యక్తిగా పనిచేస్తున్న సాబీర్ పాషా ఆలోచన కూడా సాంబశివరావు అభివృద్ధికి తోడు కావడంతో మున్సిపల్ కార్పొరేషన్ ఓటర్లు సిపిఐకి మొగ్గు చూపుతున్నారన్న దానికి నిదర్శనంగా నిలవనుంది. కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో మెజార్టీ స్థానాలను గెలిచి కొత్తగూడెం మేయర్ పీఠం వైపు సిపిఐ అడుగులు వేస్తుంది.

# క్రికెట్ టోర్నమెంట్ విన్నర్ గొల్ల కొత్తూరు



**ప్రజాపక్షం/మణుగూరుః** పగిడేరు గ్లోబల్ విలేజ్ గా ప్రసిద్ధిగాంచిందని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కారం పుల్లయ్య అన్నారు. మాజీ సర్పంచ్, ఎంపీటీసీ అమరజీవి కుంజా కృష్ణకుమారి ద్వితీయ వర్ధంతి సందర్భంగా సర్పంచ్ కుంజా శ్రవణ్ కుమార్ రాజా ఆధ్వర్యంలో మూడు రోజులపాటు క్రికెట్ పోటీలను నిర్వహించారు. క్రికెట్ పోటీల ఆర్గనైజర్ గా బేతమల్ల సుందర్ నిర్వహించారు సోమవారం సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేశారు. స్మారక క్రికెట్ టోర్నమెంట్ విన్నర్ గా గొల్ల కొత్తూరు కైవసం చేసుకుంది. గొల్ల కొత్తూరు క్రికెట్ కెప్టెన్ కారం నాగేంద్రబాబు వైస్ కెప్టెన్ ఎస్ కే రహీం పాషా తమ గ్రామానికి కుంజా కృష్ణకుమారి ట్రోఫీ, ప్రైజ్ మనీ గెలవడం ఆనందంగా ఉన్నదని సంతోషం వ్యక్తం చేశారు. రన్నర్ గా శాంతినగర్ టీం కైవసం చేసుకున్నది కెప్టెన్ గార విష్ణు వైస్ కెప్టెన్ బేతమల్ల సుందర్ పంచాయతీ పరిధిలో నిర్వహించిన క్రీడలు యువతకు ఆనందాన్నిచ్చాయన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిఐటియు సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు విజేతలకు ట్రోఫీలను అందజేశారు. అనంతరం కారం పుల్లయ్య మాట్లాడుతూ పగిడేరు గ్రామం చారిత్రాత్మకమైనదని అన్నారు. జియోథర్మల్ ప్లాంట్, వేడినీటి బోర్లు, ఈ గ్రామానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో కుంజా రాజు, నరసింహారావు, ప్రసాద్, దామల్ల దయాకర్, పులిగిల్ల ప్రవీణ్ ముల్కా వేణు, కుంజ వరదయ్య,రెంటాల నరసయ్య, అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన నిలిచే వారిని గెలిపించండి

(మొదటిపేజీ తరువాయి)

డబ్బు పంపిణీగా మారిపోయిందని ప్రస్తుత ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్న వారు మళ్లీ పదవుల ద్వారా ఆర్థిక లబ్ది పొందేందెకు ప్రయత్నిస్తారని దీనిని ఓటర్లు గమనించాలన్నారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన నిలిచి పనిచేసేది కమ్యూనిస్టులు మాత్రమేనని నిరంతరం ప్రజల్లో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తారని ఆయన అన్నారు. అందుబాటులో ఉండే వారిని గెలిపించడం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని హేమంతరావు కోరారు. విజ్ఞతతో ఆలోచించి కమ్యూనిస్టు అభ్యర్థులను గెలిపిస్తే ఆయా మున్సిపాలిటీల్లో ప్రజా గొంతుకగా పనిచేస్తారని ఆయన తెలిపారు.

# ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోంది..

(మొదటిపేజీ తరువాయి)

అనేది ప్రజాస్వామ్య స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని ఇందుకు కారకులైన వారిని వదిలిపెట్టబోమన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధిస్తుందని 80 శాతం స్థానాల్లో కాంగ్రెస్‌దే విజయమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధిక స్థానాలు గెలవబోతుందనే విషయాన్ని తెలుసుకుని బిఆర్ఎస్ అక్రోశం వెల్లగక్కుతుందన్నారు. బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని నెలకు రూ.6,300 కోట్లు వడ్డీలకే చెల్లిస్తున్నామని ఆయన అన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇండ్ల పేరుతో మొండి గోడలు దర్శనమిచ్చాయని ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ సిపిఐ మా మిత్రపక్షమేనని ఆయన సమాధానం ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇద్దరి మధ్య పోటీ కేవలం స్నేహపూర్వక పోటీ మాత్రమేనన్నారు.

# వంచన చేసిన కాంగ్రెస్‌ను ఓడించండి

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజలను వంచించిన కాంగ్రెస్‌ను మున్సిపల్ ఎన్నికలలో ఓడించాలని బిఆర్ఎస్ నేతలు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పట్టణాలను అభివృద్ధి పరిచిన బిఆర్ఎస్‌ను గెలిపించి మరోసారి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. మంగళవారం బిఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఖమ్మం గడ్డపై కాంగ్రెస్ రాక్షస రాజకీయం తప్ప అభివృద్ధి శూన్యమని ఆరాచకం పెరిగిపోతుందని ఆరోపించారు. కేసిఆర్ పదేళ్ల అభివృద్ధికి, రెండున్నర ఏళ్ల కాంగ్రెస్ వంచనకు మధ్య ఉన్న తేడాలు గమనించాలని ఆయన కోరారు. మంత్రులు చెప్పుకోవడానికి చేసిన అభివృద్ధి లేక బెదిరింపులకు పాల్పడుతున్నారని ఓటు వేయకపోతే బొక్కలో వేస్తామని మంత్రి స్థాయి వ్యక్తి బెదిరించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తాతా మధు మాట్లాడుతూ కేసిఆర్ నాయకత్వంలో జరిగిన అద్భుతమైన అభివృద్ధికి ప్రస్తుత కాంగ్రెస్ పాలన ఆరాచక పాలనకు మధ్య ఉన్న తేడాను గమనించాలని కోరారు. ముగ్గురు మంత్రులు ఉండి కూడా అభివృద్ధి చెప్పకోలేక ప్రలోభాలకు తెర లేపారన్నారు. ప్రభుత్వ వ్యవస్థలను ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. మీడియా సమావేశంలో మాజీ శాసన సభ్యులు కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతి, డిసిసిబి మాజీ అధ్యక్షులు కూరాకుల నాగభూషణం, రూరల్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు వేసేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు అనుమతి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జిల్లాలో జరుగుతున్న ఐదు మున్సిపాలిటీ పరిధిలో ఓటు హక్కు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ఓటు హక్కు వినియోగానికి అనుమతులు మంజూరు చేయాలని జిల్లాలోని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. కల్లూరు, సత్తుపల్లి, మధిర, వైరా, ఏదులాపురం పరిధిలో ఫిబ్రవరి 11న ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందికి ఓటు హక్కు వినియోగం కోసం తప్పనిసరిగా అనుమతి మంజూరు చేయాలని కలెక్టర్ తెలిపారు. మున్సిపాలిటీలో ఓటు హక్కు ఉన్నట్లు ప్రభుత్వ సిబ్బంది సంబంధిత శాఖాధికారులకు వివరాలు సమర్పించి అనుమతి పొందాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# విల్లా సముదాయంలో చోరీ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల ప్రాంతం ఎస్ఆర్ గార్డెన్ సమీపంలోని ఓ విల్లా సముదాయంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దీనికి సంబంధించి ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే... విల్లా సముదాయంలో నివసించే రియల్ ఎస్టేట్ వ్యాపారి వల్లభనేని వెంకన్న నాలుగు నెలల క్రితం అమెరికా వెళ్లినట్లు సమాచారం. తాళం వేసి ఉన్న ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాలతో పాటు వెండి వస్తువులు అపహరించినట్లు సమాచారం. దీనికి సంబంధించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఖానాపురం హవేలీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విల్లా సముదాయాల్లోని సిసి కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలించారు.

# సర్పంచ్ నిర్మలకుమారి దాతృత్వం



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం గ్రామానికి చెందిన గద్దల తిరుపతయ్యకు హార్ట్‌కు సంబంధించిన సమస్య రావడంతో కేఎన్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు, సర్పంచ్ తుళ్లూరు నిర్మలకుమారి దంపతుల సొంత ఖర్చులతో అతనికి హార్ట్ ఆపరేషన్ చేయించారు. గ్రామానికి చెందిన గద్దల తిరుపతయ్య వ్యవసాయ కూలీగా పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతనికి గత నాలుగు రోజుల క్రితం ఒక్కసారిగా గుండె నొప్పి రావడంతో సర్పంచ్ నిర్మలకుమారి దంపతులను కలవగా వెంటనే వారు అతన్ని విజయవాడ ఎన్నారై హాస్పటల్‌కు పంపి గుండె ఆపరేషన్ చేయించడం జరిగింది. కోటేశ్వరరావు, నిర్మలకుమారి దంపతుల కుమార్తె డాక్టర్ రేష్మ, అల్లుడు డాక్టర్ సృసేన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో తిరుపతయ్యకు ఎన్నారై హాస్పటల్‌లో మెరుగైన వైద్య సేవలు అందించారు.వారి సహకారంతో తిరుపతయ్యకు ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చట్టు పార్వతి, ఎల్వి నారాయణరెడ్డి, బుసిపోగు ప్రభాకర్‌రావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# 16 నుంచి పెన్షనర్ల రిలే నిరాహార దీక్షలు

**-జాతీయ సార్వత్రిక సమ్మెకు మద్దతు**
**-ఎస్‌జిపిఎటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్ల బకాయిలను సత్వరమే చెల్లించాలనే డిమాండ్‌తో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఏటి) ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16 నుండి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య తెలిపారు. మంగళవారం కృషి భవన్‌లో జరిగిన ఎస్‌జిపిఏటి జిల్లా ఆఫీస్ బేరర్స్, ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పరిశ పుల్లయ్య మాట్లాడుతూ ఈనెల 12న జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఎస్‌జిపిఏటి మద్దతునిస్తుందని తెలిపారు. పెన్షన్ బకాయిలు తీసుకోకుండానే పలువురు పెన్షనర్లు తనువు చలించారని అయినా ప్రభుత్వం పెన్షనర్ల పట్ల వైఖరి మారలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో పెన్షనర్లు ఉద్యమబాట పడుతున్నారని పుల్లయ్య తెలిపారు. రెండేళ్లుగా పెన్షనర్లు హెల్త్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. పిఆర్‌సి గడువు తీరిన ప్రభుత్వం స్పందించడం లేదని, డిఏ బకాయిల చెల్లింపుల్లో కూడా అలసత్వం ప్రదర్శిస్తుందన్నారు. ఇప్పటికైనా పెన్షనర్ల డిఏ బకాయిలు నగదు పూర్వకంగా ఒకే విడతలో చెల్లించాలని ఎస్‌జిపిఏటి డిమాండ్ చేస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పెదమాళ్ల సత్యనారాయణ, కొలికొండ శరత్‌బాబు, శ్యాంసుందర్, మహిళా కార్యదర్శులు బోజడ్ల కృష్ణకుమారి, తాడి అంజలి, బెల్లం రాధాకృష్ణమూర్తి, ప్రసాదరావు, కనపర్తి నాగప్రసాద్, వీరభద్రరావు, చీదిరాల వెంకటేశ్వర్లు, వై. రామకృష్ణ, వెంకట్రామ నర్సయ్య, రామారావు, సాగర్, ఉషారాణి, హమీద్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ల సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలశ్రేయస్సే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన సాగిస్తుందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇండస్ట్రీయల్ పార్కుల్లో స్థలాల కేటాయింపు, ఆరోగ్య శ్రీ పరిమితి పెంపు, యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు, అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు. అభివృద్ధిని కొనసాగించాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# సురక్షిత అంతర్జాల వినియోగంపై అవగాహన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సురక్షిత అంతర్జాల వినియోగం, కృత్రిమ మేధస్సు (ఏఐ)పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మంగళవారం ఖమ్మం నగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సురక్షిత అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు సురక్షిత అంతర్జాల వినియోగం, కృత్రిమ మేధస్సుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సురక్షిత అంతర్జాల వినియోగంపై బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అవగాహన సదస్సులో జాతీయ సమాచార కేంద్రం జిల్లా అధికారులు డిఐవో రాంప్రసాద్, ఏడిఐవో బిక్షు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ భద్రత, ధృఢమైన సంకేత పదాలు (పాస్‌వర్డ్) వినియోగం, ద్విపాత్రిక ధృవీకరణ విధానం, సురక్షిత అంతర్జాల విహారం (వెబ్ బ్రౌజింగ్) సైబర్ నేరాల ఫిర్యాదు విధానాలు, ఆన్‌లైన్ మోసాల నివారణ, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం అరికట్టడం, వ్యక్తిగత సమాచార రక్షణ, హ్యాకింగ్, మోసపూరిత సందేశాలు, కృత్రిమ మేధస్సు (ఏఐ) సురక్షిత వినియోగం, సురక్షిత డిజిటల్ ఆచరణ వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణ లక్ష్యం

**- పోలీస్ కమిషనర్ సునీల్‌దత్**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంతో కూడిన నిష్పక్షపాత ఎన్నికలు జరిగేలా సమన్వయంతో పోలీసులు పని చేయాలని కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. మంగళవారం ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బందోబస్తు విధులు నిర్వహణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకులోబడి పనిచేయాలన్నారు. ఎన్నికల నియమావళిపై సమగ్ర అవగాహన ఏర్పర్చుకుని, ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందని చెప్పారు. అత్యవసర సమయాల్లో వెంటనే స్పందించాలన్నారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉండాలని, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాలను వదిలి వెళ్లవద్దని సూచించారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావాన్ని నిలువరించేందుకు ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటోందని గ్రహించాలన్నారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్,ఫ్లైయింగ్‌స్క్వాడ్‌టీమ్స్, చెక్‌పోస్టులు, రూట్ మొబైల్‌పార్టీలు, ఎన్నికలముందు, పోలింగ్‌రోజు, ఓట్ల లెక్కింపు సందర్భంగా నిర్వహించే విధులలో పూర్తి అవగాహన ఉండాలన్నారు. అదేవిధంగా పోలింగ్ అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐదు మున్సిపాలిటీలలో 11వందల మంది పోలీస్ సిబ్బంది పాల్గొంటున్నారని అన్నారు. ఎక్కడ కూడా ఘర్షణ వాతావరణం లేకుండా పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(ఏఆర్) కుమారస్వామి, ఏసీపీ తిరుపతిరెడ్డి, నర్సయ్య, రూరల్ డివిజన్, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

# నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** నేడు జరగనున్న ఏదులాపురంమున్సిపాలిటీ ఎన్నికలకై ఎన్నికల సంఘం సర్వసిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో 6వ వార్డులోని మేద కళాశాల కేంద్రంగా మంగళవారం ఎన్నికల సామగ్రిని ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేశారు. 32వార్డులకు గాను ఒకవార్డు ఏకగ్రీవం కాగా 31వార్డుల్లో పోలింగ్ జరగనుంది. 69పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా..12మంది జోనల్ ఆఫీసర్లతో పాటు ఒక్కోపోలింగ్ కేంద్రానికి ఒక ఆర్ఓ, ఏఆర్ఓ కలిపి ఏడుగురు అధికారులు పోలింగ్ బాధ్యత నిర్వహించనున్నారు.కాగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు పోలీసులు ఘట్టి బందోబస్తు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్, కమిషనర్ మున్వర్‌అలీ, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంతో జరిగేలా చూడాలి

**అడిషనల్ డిసిపి(లా అండ్ ఆర్డర్) ప్రసాదరావు**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాల్ ఎన్నికల నేపథ్యంలో బందోస్తు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది యొక్క ఎన్నికల విధులు, విధి విధానాల, ఎన్నికల ప్రవర్తన నియమావళి, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలపై వైరా డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో వైరాలోని వెటర్నరీ హాస్పిటల్ భవనంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో అడిషనల్ డిసిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకు లోబడి పనిచేయాలన్నారు. ఎన్నికల నియమావళిపై సమగ్ర అవగాహన ఏర్పరచుకొని ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని చెప్పారు. అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలని, శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉండాలని సూచించారు. ఎన్నికల ముందు , పోలింగ్ రోజు, ఓట్ల లెక్కింపు సందర్భంగా నిర్వహించే విధుల్లో పూర్తి అవగాహన ఉండాలన్నారు. అదేవిధంగా ఎన్నికలు ముగిసిన తర్వాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సెక్షన్ 163 బిఎన్ఎన్ఎస్ అమలులో ఉన్నందున పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో గుంపులుగుంపులుగా లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్, ఏసిపి సర్వర్, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# వైరా ఏసిపిని కలిసిన రిటైర్డ్ ఉద్యోగులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా ఏసిపిగా బాధ్యతలు చేపట్టిన సాదుల సారంగపాణిని వైరా మండల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం పక్షాన మర్యాదపూర్వకంగా కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు, వైరా మండల శాఖ అధ్యక్షులు చల్లా కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మాచర్ల జయశంకర్, ఆర్థిక కార్యదర్శి సామినేని వెంకటేశ్వరరావు, మండల శాఖ బాధ్యులు గణపారపు వెంకటకృష్ణారావు, కొంగర నాగేశ్వరరావు, శీలం పిచ్చిరెడ్డి, యలమంచిలి భోగేశ్వరరావు, చింతోజు నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.రాధాకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రుద్ర వెంకటనారాయణ, రిటైర్డ్ పోలీస్ అధికారులు రామకృష్ణ, రాజారావు, కె.నర్సింహారావు, పూర్ణచంద్రరావు, చంద్రశేఖర రావు, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని మల్లవరం గ్రామంలో మంగళవారం బ్యాంక్ అప్లికేషన్, రియాక్టివేషన్, కేవైసీలపై ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీధర్‌రాజు, సర్పంచ్ కటికి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీల పట్ల అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కౌన్సిలర్ శ్రీనివాసరావు, నాగరాణి, సురేష్ మాట్లాడుతూ ప్రతిక్కరూ బ్యాంక్ కేవైసిఆర్, ఈకేవైసీ, సి కేవైసి అకౌంట్ అప్డేషన్ చేసుకోవాలని, ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, ధనవంత్రి జీవన్ జ్యోతి, సురక్షబీమా యోజన సుకన్య సమృద్ధి యోజన అటల్ పెన్షన్ యోజన రూపే కార్డులపై అవగాహన కల్పించారు. ఇన్సూరెన్స్ చేయడం ద్వారా ప్రమాదవశాత్తు చనిపోయిన కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా రూ.10లక్షలు వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎస్కే సిద్ధిక్‌మియా, ఉపసర్పంచ్ యశోద, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, బ్యాంకు కౌన్సిలర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

# ఘనంగా దయాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని రామానుజవరం గ్రామంలో రెవెన్యూశాఖ నిర్మాణ సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి తుంబూరి దయాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం జిల్లా కాంగ్రెస్ నాయకులు శీలం కోటారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా తుంబూరి దయాకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మొక్కను నాటారు. అనంతరం శీలం కోటారెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో రాజకీయాల్లోనూ రాణిస్తున్న ఆయన ఎంతో మందికి చేయూతగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిన్నెర వెంకటకృష్ణవేణి, ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణ, వార్డు మెంబర్లు పసుపులేటి రత్తయ్య, శీలం అంజిరెడ్డి, నంద్యాల జమున, కిన్నెర తిరుపతమ్మ, శ్రీకృష్ణ, బ్రహ్మారెడ్డి, మధుసూదన్‌రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి



**-మున్సిపల్ ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు**
**-కల్లూరు ఏసీపీ వసుంధరయాదవ్**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లిలో నేడు జరగనున్న మున్సిపల్ ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కల్లూరు ఏసిపి వసుంధరయాదవ్ సూచించారు. ఎన్నికల బందోబస్త్ విధులకు హాజరవుతున్న పోలీస్ సిబ్బంది యొక్క విధులు, విధివిధానాల అవగాహన కార్యక్రమం మంగళవారం సత్తుపల్లి పోలీస్ స్టేషన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు ఏసీపీ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నిష్పక్షపాత ఎన్నికలే ప్రధాన లక్ష్యంగా పోలీస్ సిబ్బందికి అప్పగించిన బాధ్యతలు ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ఫలితాలు ప్రకటించే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు భయభ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ప్రశాంతమైన వాతావరణం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ శ్రీ హరి పాల్గొన్నారు.

# విజయం ఎవరిది ఓటుదా..? నోటుదా..?

**-సత్తుపల్లి మున్సిపాలిటీలో ప్రలోభాల పర్వం**
**-23 వార్డుల్లో హోరాహోరీ పోటీ**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మున్సిపాలిటీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. 23 వార్డుల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర స్థాయి పోటీ కొనసాగుతోంది. అయితే ఈ ఎన్నికల పోరులో అభివృద్ధి, ప్రజా సమస్యల కంటే ప్రలోభాలే ప్రధాన అస్త్రంగా మారాయన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఓటు కోసం నోటుఅదనంగా బహుమతులు ప్రతి ఓటరును ఆకట్టుకునేందుకునగదు పంపిణీరోజువారీ అవసరాల సరుకులు ఆకర్షణీయమైన బహుమతులువంటి చర్యలు బహిరంగ రహస్యంగా మారాయి. 'ఓటు' విలువ 'నోటు' ముందు తగ్గిపోతుందా? అన్న ప్రశ్న స్థానికంగా చర్చకు దారి తీస్తోంది. అధికార పార్టీ అధికార బలం, సంక్షేమ పథకాల ప్రచారంతో ముందుకు వెళ్తుండగా, ప్రతిపక్షాలు ప్రజల్లోని అసంతృప్తిని తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేస్తున్నాయి.ప్రతి వార్డులో గెలుపే లక్ష్యంగా రెండు పక్షాలు వ్యూహాలు రచిస్తున్నాయి. ఓటర్లలో మిశ్రమ స్పందనప్రజల్లో భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.





**చివరకు గెలిచేది ఎవరు..?**

ఈ ఎన్నికల్లో తాత్కాలికంగా డబ్బు గెలిచినట్టుగా కనిపించినా దీర్ఘకాలంలో ప్రజలే నష్టపోయే పరిస్థితి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అవగాహనతో వినియోగించిన ఓటే నిజమైన విజయం తీసుకువస్తుందన్న వాదన బలంగా వినిపిస్తోంది. సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికలు కేవలం 23 వార్డుల రాజకీయ పోటీ మాత్రమే కాదని, ఇది ప్రజాస్వామ్య విలువలపై జరుగుతున్న పరీక్షని,ప్రలోభాలే గెలిస్తే రాజకీయాలు దిగజారుతాయని,వివేకంతో వేసిన ఓటే గెలిస్తే పాలన మారుతుందని విశ్లేషకులంటున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో పేటలో రూ.7వేలు పలికిన ఓటు ధర

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** నూతనంగా ఏర్పడ్డ అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓటు ధర సుమారు రూ.7వేలకు పైగానే వెళ్లింది. దీనికి తోడు అధికార పార్టీ చీరలు, వంట కుక్కర్లు, క్యారేజిలు వంటి బహుమతులు కూడా 6, 8, 13వ వార్డుల్లో పెద్ద ఎత్తున్న పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఏ విధంగానైనా మున్సిపాలిటీ పీఠాన్ని దక్కించుకోవాలని కోట్ల రూపాయల డబ్బులను ఓటర్లకు ఆశ చూపి మున్సిపాలిటీ కార్యాలయంపై జెండా ఎగరవేయాలని పావులు కదుపుతుంది. అదేవిధంగా ప్రతిపక్ష టిఆర్ఎస్ పార్టీ సైతం పెద్ద మొత్తంలోనే ఓటర్లకు పంపిణీ చేపట్టిందని, ఇవేకాక కొన్ని రకాల బహుమతులు సైతం ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు పంపిణీ కార్యక్రమాన్ని యథేచ్ఛగా బహిరంగంగా నిర్వహించటం గమనార్హం. ఎన్నికల నిబంధనలు ఉన్నప్పటికీ రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున ఓటర్లను ఆకట్టుకునే విధంగా పంపిణీ కార్యక్రమం చేపట్టడంపై పలు విమర్శలకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ అధికారులను అడ్డం పెట్టుకుని ఓటర్లను బెదిరిస్తూ ఇతర పార్టీలో ఉన్న నాయకులను సైతం ధనంతో నోరు మూపించి ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కి వారు ఆడింది ఆట పాడింది పాటగా బయట గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలను సేకరించి పంపిణీ కార్యక్రమాన్ని పోలీసుల కన్నుసన్నల్లోనే నిర్వహిస్తున్నారని బహిరంగ రహస్యమే. ఏదిఏమైనప్పటికీ అశ్వారావుపేట మున్సిపాల్టీని దక్కించుకోవటం కోసం కాంగ్రెస్ అనేక అడ్డదారులను తొక్కుతూ సుమారు రూ.10కోట్లకుపైగా పంపిణీ చేట్టిందని ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇదిలా ఉంటే 6, 13



వార్డుల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఓటర్లకు ఓటుకు సుమారు రూ.10వేలు వరకు నగదు రపంలో బహుమతుల రూపం, మందు మాంసం రూపంలో పంపిణీ చేయగా మిగిలిన 20 వార్డుల్లో ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ వైఖరి పట్ల తీవ్రమైన వ్యతిరేకతను కనబరుస్తున్నట్లు కన్పిస్తుంది. అంతేకాకుండా టిఆర్ఎస్చైర్మన్ అభ్యర్థిని ఓడించాలని ఉద్దేశ్యంతో 8 వార్డులో సైతం పెద్ద ఎత్తున్న కాంగ్రెస్ పార్టీ నగదుతో పాటు బహుమతులు కూడా అందిస్తుందని ఓటర్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మిగిలిన వార్డుల్లో ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ తక్కువ మొత్తంలో పంపిణీ చేయటంతో అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే టిఆర్ఎస్ పార్టీ సైతం నగదు పంపిణీ అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా ఇవ్వలేకపోయిన్నప్పటికీ ఉన్నంతలో 22 వార్డులోను ఓటర్లకు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారని ఓటర్లు చర్చించుకుంటున్నారు.

# సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ విద్యార్థుల ఘన విజయం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మరోసారి సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. బిటెక్ మూడవ సంవత్సరం ఫైనల్ పరీక్షల ఫలితాల్లో వివిధ బ్రాంచీల్లో అత్యుత్తమ మార్కులు సాధించి జిల్లా స్థాయిలో అగ్రస్థానంలో నిలిచారు. ఈ ఫలితాలను జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ మంగళవారం ప్రకటించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ విద్యార్థుల కష్టపడి చదివిన శ్రమకు ఇది గొప్ప ఫలితం. ప్రతి బ్రాంచీ నుంచి వచ్చిన అద్భుతమైన ఎస్ జి పిఏలు మా కళాశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. బ్రాంచీల వారీగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఈఈఈలో విశాల్ హర్షవర్ధన్ రావు, శ్రీకర్, పద్మభూషణ్,ఈసీఈలో రమ్య, ధన్యశ్రీ, పూజిత, సిఎస్ఈలో దుర్గాదీక్షిత (90% పైగా), ఇసుబ్ అలియా, శరణ్య, రేణుక, కావ్యాంజలి,సిఎస్ఈ(ఏఐ అండ్ ఎంఎల్)లో రజియా, లక్ష్మీ ప్రియ, రవీంద్ర, హిమజ,ఏఐ అండ్ డిఎస్ లో మాధురి, ప్రణయ్ వెంకటసాయి, హేమంత్ సాయి, నవీన్ కుమార్ప్రతి విభాగంలో విద్యార్థులు 90శాతం పైగా మార్కులతో కళాశాలకు గర్వకారణంగా నిలిచారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త, హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత బండి పార్థసారథి రెడ్డి అభినందించారు. కళాశాల కార్యదర్శి దాసరి ప్రభాకర్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. శేఖర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా. యాకూబ్, అన్ని విభాగాధిపతులు విద్యార్థులను అభినందించారు.

# సాగునీటి కోసం రైతులు ధర్నా



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని అల్లీనగరం, మడుపల్లి,దేశినేనిపాలెం భూములకు సాగునీరు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బోనకల్ రోడ్డుపై రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సాగునీరు అందక పొలాలు ఎండిపోయే పరిస్థితి ఉందని, ఎన్నో కష్టానష్టాలకోర్చి పంటలు పండిస్తున్నామని, తీరా పంటలు చేతికొచ్చే సరికి సాగునీరు అందక పొలాలు ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లి అప్పులపాలై రోడ్డున పరిస్థితి నెలకొందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పొలాలను కాపాడేందుకు వెంటనే సాగునీరు అందించాలని కోరారు. రైతుల ధర్నాతో సుమారు గంటసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అనంతరం అధికారులు అక్కడికి చేరుకుని సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో రైతులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు శాఖమూరి కోటేశ్వరరావు, సూర్యదేవర సాంబశివరావు, పాటిబండ్ల శ్రీహరి, కమతం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు ఒక్కసారి ఆలోచించి ఓటేయండి



**ప్రజాపక్షం / మధిర :** కేసిఆర్ పదేళ్ల పాలనలోనే మధిర ప్రతిష్ట పెరిగిందని, రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో విధ్వంసం జరిగిందని, మధిర మున్సిపాలిటీ ప్రజలు ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలని బిఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి, మాజీ జెడ్పిచైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. మంగళవారం మధిరలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల కేసిఆర్ పాలనలో మధిర పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. వంద పడకల ఆసుపత్రి, ట్యాంక్ బండ్, వెజ్ నాన్ వెజ్ మార్కెట్, చెక్ డ్యామ్, అంతర్గత రహదారులు, పార్కులు లాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను కేసిఆర్ పాలనలో మధిర ప్రజలకు అందించారని గుర్తు చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మధిర పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనుల పేరుతో విధ్వంసం తప్పా అభివృద్ధి ఎక్కడా కన్పించటం లేదన్నారు. ఇప్పుడు ఎన్నికల సమయంలో నాకు పెద్ద అవకాశం వచ్చింది అభివృద్ధి చేస్తా అంటున్న భట్టివిక్రమార్క రెండేళ్ల కాలంలో ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మధిర మున్సిపాలిటీ ప్రజలు ఎంతో చైతన్యవంతులని, మధిర మున్సిపాలిటీ అభివృద్ధి జరగాలంటే బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

# జమలాపురంలో విద్యుత్ సమస్యలపై ప్రజా బాట




**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో మంగళవారం గ్రామ విద్యుత్ సమస్యలపై ఎఇ అనూష, సర్పంచ్ నిర్మలకుమారి ఆధ్వర్యంలో ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో గ్రామంలో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కారం కోసం సర్పంచ్ నిర్మలకుమారి అధ్యక్షతన విద్యుత్‌శాఖ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎఇ అనూష మాట్లాడుతూ గ్రామంలో ఉన్న విద్యుత్ సమస్యలను తమ సిబ్బంది గుర్తించి వెంటనే మరమ్మత్తులు చేసేందుకు గ్రామపంచాయతీ సిబ్బంది అవసరాలను తమ దృష్టికి తేవాలన్నారు. గ్రామంలో విద్యుత్ లైన్లలో ఉన్న సమస్యలు, మిడిల్ పోల్స్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, నూతన స్తంభాల ఏర్పాటు తదితర అవసరాలపై సర్పంచ్ నిర్మలకుమారి విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చట్టు పార్వతీ, లైన్మెన్ అనంత్, గ్రామస్తులు చొప్పవరపు శ్రీనివాసరావు, వెంకటామిరెడ్డి, లాజర్, బుజ్జిబాబు, గోపాల్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ పెద్దమల్ల శ్రీనివాస్‌రావుకు జాతీయ అవార్డు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన కాకతీయ యూనివర్సిటీ ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం ప్రొఫెసర్ పెద్దమళ్ళ శ్రీనివాస్‌కు గ్లోబల్ ఫౌండేషన్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ వారు భారత్ గౌరవ్ ఉగాది పురస్కారం 2026ను విద్యా, సామాజిక సేవా రంగాల్లో పనిచేస్తున్నందుకు జాతీయ అవార్డును ప్రకటించారు. ఈ సంస్థ ఫౌండర్ ప్రెసిడెంట్ కె.కృష్ణమూర్తి ఈ అవార్డును మార్చి 22, 2026 సూరవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియం హైద్రాబాద్‌లో అందించనున్నట్లు తెలిపారు. ఆయనకు ఈ అవార్డు రావడం పట్ల పలువురు యూనివర్సిటీ విద్యార్థులు, పరిశోధకులు, డాక్టరేట్లు, ఉద్యోగులు ప్రత్యేక అభినందించారు. ఆయన స్వగ్రామమైన బనిగండ్లపాడు సర్పంచ్ జయరాజు, ఉపసర్పంచ్ రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# మిస్ట్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** స్థానిక మదర్ తెరిసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న అన్ని విభాగాల విద్యార్థులకు హేమోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ చెన్నై (సింగపూర్ బేస్డ్ కంపెనీ) ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని హరికృష్ణ మంగళవారం తెలియజేశారు. ఈ ప్రాంగణ నియామకాలలో బీటెక్ విద్యార్థులను ప్రసాద్ (హెచ్ ఆర్ డిపార్ట్మెంట్), లావణ్య (టెక్నికల్ డిపార్ట్మెంట్), హరిత (మేనేజింగ్ డైరెక్టర్)లు టెక్నికల్ పరీక్ష, టెక్నికల్ ఇంటర్వ్యూ, హెచ్.ఆర్ రౌండుల ద్వారా పరీక్షించి అత్యంత ప్రతిభ కనబరిచిన 24 మంది విద్యార్థులను ఐటి ఇంటర్న్ షిప్ కు ఎంపిక చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ముగ్గురు విద్యార్థులను రూ.4 లక్షల వార్షిక వేతనంతో పైతాన్ డెవలపర్స్‌గా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంగణ నియామకాలను సాధించిన విద్యార్థులను సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వి. రామచంద్ర రావు , ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ ఆఫీసర్ టీ. రాఘవ రాజు, వివిధ విభాగాలు అధిపతులు, అధ్యాపకులు బోధ నేతర సిబ్బంది అభినందించారు.

# ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



**– కలెక్టర్ జితేష్ వి పాటిల్**

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఎన్నికలు సజావుగా, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలైన పాల్వంచ అనుబోస్ కాలేజీ, ఇల్లెందు సింగరేణి పాఠశాలలను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల సామాగ్రి పూర్తిగా అందిందా లేదా విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రధానంగా బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో పోలీస్ బందోబస్తు తప్పని సరిగా ఉండాలని, సమస్యలు తలెత్తితే వెంటనే తనకు తెలపాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో ఆయన వెంట ఎన్నికల అధికారులు, పోలీస్ అధికారులు తదితరులున్నారు.

# 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**కార్మిక సంఘం జిల్లా నాయకులు యర్రా బాబు పిలుపు**



**ప్రజాపక్షం/వైరా:** కార్మికులు శ్రమ జీవులు, కర్షకులు, విద్యార్థులు, యువజనుల, మహిళల హక్కుల రక్షణకై ఈ నెల12వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఖమ్మం జిల్లా కార్మిక సంఘం నాయకులు యర్రా బాబు పిలుపునిచ్చారు. మంగళశారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏఐటియుసి మండల కార్యదర్శి గారపాటి అశోక్ అధ్యక్షతన జరిగిన మున్సిపాల్ ఆటో విద్యుత్ ఇతర కార్మిక సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు బడా పారిశ్రామికవేత్తలు గుత్తా పెట్టుబడుదారులకు అనుకూలంగా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని విమర్శించారు. కమ్యూనిస్టులు వామపక్ష పార్టీల సుదీర్ఘ పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాగులు లేబర్ కోడ్‌ను తీసుకొచ్చి కార్మికుల హక్కులు హరించుతున్నారని, వెంటనే కొత్త కార్మిక నల్ల చటాటలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టుల పోరాటాలతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు ఉపాధి కల్పించి వలసలను నిరోధించేందుకు తీసుకొచ్చిన మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచడం తీవ్ర అన్యాయమని అన్నారు. సంవత్సరానికి 200 రోజుల పనిదినాలు కనిపించి రోజుకు కనీసం రూ.700లు ఉపాధి హామీ కూలీలకు కూలి ఇవ్వాలని పట్టణ ప్రాంతాలకు కూడా ఉపాధిహామీ పనిని విస్తరించాలని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కౌలు రైతులను గుర్తించి ఆర్థిక సహాయం పంట రుణాలు ఇవ్వాలని డాక్టర్ స్వామినాధన కమీషన్ రిపోర్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2025 జాతీయ విత్తన చట్టం రద్దు చేయాలని అన్నారు. అలాగే రైతులకు యూరియా ఆన్‌లైన్ యాప్‌ను తీసివేసి డైరెక్ట్‌గా డీలర్ల నుంచి షాపులకు వచ్చే విధంగా చేసి రైతులు నేరుగా కొనుక్కునే విధంగా చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.28వేలు ఇవ్వాలని, వృద్ధాప్య, వితంతతు, వికలాగులకు కనీస పెన్షన్ రూ.9వేలకు పెంచాలని కార్మికులకు 8గంటల పని విధానం అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను వైరా పట్టణం మండలంలోని మున్సిపాల్ ఆటో విద్యుత్, హమాలి, గుమస్తాలు, కార్మికులు అన్ని వర్గాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శియామాల గోపాలరావు, మున్సిపాలిటీ కార్మిక నాయకులు రాయపూడి శ్రీను, బోళ్ళ శ్రీను, ఆదూరి సుధాకర్, మూల కొండా, కొండా రామకృష్ణ, దుబ్బల కృష్ణ, దారా వెంకన్న, షేక్ షరీఫ్, దాసరి నగేష్, రాంబాబు, ముత్తయ్య, ఆంధ్ర కొండలరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, కృష్ణ, మునేసు తిరుపతయ్య, వెంకటి, చింతపల్లి గోపాలరావు, రాయి రవి తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు అవగాహన



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలం పరిధిలోని లింగగూడెం గ్రామపంచాయతీలో టీబి ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా పోర్టబుల్ స్పాట్ ఎక్స్‌రే క్యాంపు లంకాసాగర్ వైద్యాధికారి డా. చింత కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. జిల్లా టీబి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కోటి సుబ్బారావు హాజరై మాట్లాడుతూ టీబి వ్యాధి పట్ల ఆందోళన అవసరం లేదని మందులు వాడితే తగ్గిపోతుందని తెలిపారు. క్షయవ్యాధి నివారణనిర్మూలన అవగాహనలో భాగంగా గ్రామ ప్రజలకు టీబి వ్యాధిపై సమగ్ర అవగాహన కల్పించబడింది. టీబి కు ఆరు నెలలు నియమితంగా మందులు వాడితేకచ్చితంగా పూర్తిగా నయం అవుతుందని వివరించారు.ఇంతకుముందు గుర్తింపు ప్రధానంగా స్పుటమ్ పరీక్షలపైనే ఆధారపడగా, ప్రస్తుతం కొత్త సాంకేతికతతో పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం ద్వారా గ్రామ స్థాయిలోనే (సబ్ సెంటర్) ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం లో అప్పటికప్పుడే ఎక్స్‌రే చేసి వెంటనే లక్షణాలను గుర్తించి అవసరమైన సత్వర చికిత్స అందిస్తున్నామని తెలిపారు. క్యాంపులో ఓపి లో మొత్తం 110 లో 89 మందికి స్పాట్ ఎక్స్‌రే నిర్వహించగా, 89 మంది నుండి స్పుటమ్ నమూనాలు సేకరించి జిల్లాకు పంపించారు. ఈ క్యాంపును మండలం తహసీల్దార్ వీరబాద్ర నాయక్ పరిశీలించారు.గ్రామ సర్పంచ్ పి.పద్మ, సుగుణ దేవి, ఆరోగ్య పర్యవేక్షకులు బి. నాగేశ్వరరావు అంగన్వాడి సూపర్వైజర్ రాజ్యలక్ష్మి , కోఆర్డినేటర్ ప్రభాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మె కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కావాలి



**12వ తేదీ సమ్మెలో పాల్గొనాలని కోరుతూ**
**మణుగూరులో జేఏసీ విస్తృత ప్రచారం**

**ప్రజాపక్షం/మణుగూరు:** ఈ నెల 12వ తేదీ జరుప తలపెట్టిన సార్వత్రిక సమ్మె కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించే విధంగా సమ్మెను విజయవంతం చేయాలని మణుగూరు ఏరియా ప్రజల కోసం కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబరు కోడులను రద్దు చేయాలని విద్యుత్తు సవరణ చట్టం, 2025 విబిజి రాంజీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసి లో 100% విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకర నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మిక, ప్రజా, రైతు, వ్యతిరేక విధానాలను వెనక్కు తీసుకోవాలని కోరుతూ ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం మొత్తం పాల్గొని జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. మంగళవారం కొండాపురం సిఎ పి, కేపియూజి, జీఎం ఆఫీస్ లలో జరిగిన గేట్ మీటింగ్ లలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు, కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని కార్మికులను నిరాయుధలను చేసి పెట్టుబడుదారులు పారిశ్రామికవేత్తలు కార్పొరేటర్లకు అనుగుణంగా మార్పులు తీసుకొచ్చారని అన్నారు. విరోచితంగా పోరాడి ప్రాణత్యాగాలతో సాధించుకున్న 29 చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను ప్రవేశ పెట్టమన్నదని వారు ఆరోపించారు. కావున కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలను ఉపసంహరించుకునేలా కార్మిక వర్గం ప్రతిఘటనకు పూనుకోవాలని కార్మిక వర్గానికి నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వై రాంగోపాల్, ఆవుల నాగరాజు, ఐఎన్‌టియుసి నాయకులు, వి కృష్ణంరాజు, షేక్ అబ్దుల్ రవూఫ్, సిఐటియు నాయకులు వి వెంకటరత్నం, నరేష్, టీబీజీకేఎస్ నాయకులు నాగెల్లి వెంకట్, మస్తాన్, ఐఎఫ్‌టియు నాయకులు ఏ. చంద్రం, మంగీలాల్, సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మున్సిపాలిటీ 11వ తేదీ బుధవారం జరిగే మున్సిపాలిటీ ఎన్నికలకు గాను ఏర్పాట్లు పూర్తయినట్లు కమిషనర్ రామ దుర్గా రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 20 వార్డులు 40 పోలింగ్ కేంద్రాలు 14 పోలింగ్ జరుగు ప్రదేశాలు ఎన్నికల సిబ్బంది 256 మంది ఆర్వోలు, ఏడుగురు ఏఆర్ఓ, ఏడుగురు పిఓ, 49 ఏపీఓ, 49 పోలీస్ సిబ్బంది, 150 మంది పాల్గొంటున్నట్లు కమిషనర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఓటర్లు సహకరించాలని పోలీసులు తెలిపారు. ఎన్నికల కేంద్రాలను కలెక్టర్ అనుదీప్ కలెక్టర్ అజయ్ యాదవ్ పోలీస్ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించారు.

# సమ్మెకు అనుమతించండి



**ప్రజాపక్షం/కల్లూరు:** ఈనెల 12వ తేదీ గురువారం సమ్మెకు అనుమతించాలని కోరుతూ కల్లూరు లోని సబ్ కలెక్టర్‌కు అనుమతించాలని కోరుతూ వినతిపత్రం ఏఐటియుసి ఆధ్వర్యంలో అందజేశారు. అఖిలభారత సార్వత్రిక సమ్మె కారణంగా ఆ రోజు ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా అనుమతిని మంజూరు చేయాలని కోరుతూ సబ్ కలెక్టర్ తహశీల్దార్, ఎంపీడీవో, ప్రభుత్వ ఆసుపత్రి సూపరెండెంట్‌కు కార్మికులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వేము రాంబాబు, దయాకర్ రావు గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మొత్తం 20 వార్డులకు గాను 41 పోలింగ్‌స్టేషన్‌లు, మొత్తంఓటర్ల సంఖ్య 24689, పిఎస్ లొకేషన్‌ల సంఖ్య 16 ఉన్నాయి. **పోలింగ్ సిబ్బంది వివరాలు :** రిటర్నింగ్ అధికారులు 10, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు 10, పిఎస్‌కు పివో1, ఏపివో 1, ఓపివో 3 చొప్పున మొత్తం 262, ఎస్ఎస్‌టి, విఎస్‌టి, ఎఫ్ఎస్‌టి, వివిటి అధికారులు మొత్తం 24, వెబ్ క్యాస్టింగ్ సిబ్బంది 5, మాస్టర్ ట్రైనర్‌లు 3, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సిబ్బంది మున్సిపాల్ 130, పంచాయతీరాజ్ 40, టీచర్స్ 10 ఉన్నారు. జోనల్ అధికారులు 3, రూట్ ఆఫీసర్స్ 6, మున్సిపాల్ పరిధిలో పిఎస్‌లో పోలీస్ సిబ్బంది 150, మొత్తం మున్సిపాల్ ఎన్నికల్లో 653 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

# శివాలయ నిర్మాణంలో శ్రమదానం





**ప్రజాపక్షం/కామేపల్లి:** మండల కేంద్రమైన కామేపల్లి శివాలయ పునర్నార్మాణ పనులలో మంగళవారం జరిగిన శ్రమదాన కార్యక్రమం కోలాహలంగా జరిగింది. కామేపల్లిలో పురాతనమైన శివాలయాన్ని తొలగించి దానిస్థానంలో నూతనంగా దేవాలయ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. పునాదుల వరకు వచ్చిన దేవాలయ మండపంలో ఇసుకను నింపేందుకు గ్రామస్తులు చేయి చేయి కలిపి శ్రమదానం ద్వారా పనులు నిర్వహించారు. గ్రామాల్లోని పురుషులు మహిళలు యువతీ యువకులు విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమాల పాల్గొన్నారు. అనంతరం శ్రీహరి హర కురుక్షేత్రం శివాలయం నమూనా కరపత్రాన్ని నిర్మాణ కమిటీ విడుదల చేసింది. ఈకార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు గొట్టుపర్తి శివాజీ, సర్పంచ్ అజ్మీర హరి, మాజీ సర్పంచ్ రామదాసు, కమిటీ సభ్యులు మహంకాళి, రామ నర్సయ్య, చెరుకుపల్లి కృష్ణారాణి అమ్మవారు, దమ్మలపాటి శివాజీ, కేసగాని నాగయ్య, ఎర్ర తిరుపతిరావు, భూక్య శ్రీనివాస్, బండి శ్రీనివాస్, మోసం కృష్ణమూర్తి, అమీర్నేని నరసింహారావు, డాక్టర్ పూజల శివకృష్ణ, దీవెల నరసింహారావు, కుర్ర రాములు, రవి, హనుమంతరావు, నాగేష్, మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వాహనాల వేగం, దుమ్ము కాలుష్యం నివారణ కోసం చర్యలు చేపట్టండి



**ప్రజాపక్షం/మణుగూరు:** పట్టణంలోని కాళీమాత ఏరియా, గాంధీ నగర్ ప్రాంతాలలో సింగరేణి సంస్థకు చెందిన బొగ్గు లారీలు జనావాస ప్రాంతాల నుండి అతివేగంగా ప్రయాణించడంతో విపరీతమైన దుమ్ము మరియు ధూళి రేగి, నేరుగా ప్రజల ఇళ్లలో కి చేరుతోందని, సింగరేణి అధికారులు వెంటనే నివారణ కోసం చర్యలు చేప ట్టలని పట్టణానికి చెందిన గడ్డం రాము మంగళవారం సింగరేణి యాజమా న్యాని కి విజ్ఞప్తి చేశారు. అనంతరం రాము విలేకరులతో మాట్లాడుతూ బొగ్గు రవా ణా చేసే ప్రతి లారీపై తప్పనిసరిగా టార్పాలిన్ కవర్లు ఉండేలా చూడాలని,ప్రధాన రహదారిపై మరియు సి.ఎస్.పి. కాటా పరిసరాల్లో భారీ వాహనాలను క్రమపద్ధతి లేకుండా నిలుపుదల చేయడంతో వాహనదారులు ప్రయాణి కులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరోవైపు దుమ్ము పిల్లలు, వృద్ధులు తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారని పేర్కొన్నారు. జనావా సాల మధ్య వాహనాల అతివేగం ప్రాణాపాయ స్థితిని కలిగిస్తోందని వ్యక్తం చేశారు. వాహనాల వేగాన్ని కఠినంగా నియం త్రించాలని, దుమ్ము రేగకుండా ప్రధాన రహదారిపై, కాటా ప్రాంతాల్లో క్రమం తప్పకుండా నీటిని చల్లించాలన్నా రు. రహదారిపై వాహనాలు నిలపకుండా, భారీ వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలనికోరారు. తమ విజ్ఞప్తి ఫై సింగరేణి అధికా రులు సానుకూలంగా స్పందించారని రాము మీడియాకు వెల్లడించారు.

# ఖమ్మంను క్రీడా ప్రతిభకు కేంద్రంగా తీర్చిదిద్దాలి

**-జిల్లా గౌరవం పెంచేలా క్రీడా ప్రదర్శన ఉండాలి**
**-సిఎం కప్ జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించిన కలెక్టర్**






**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాను క్రీడా ప్రతిభకు కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సిఎం కప్ 2025 26 రాష్ట్ర స్థాయి పోటీల్లో ఖమ్మం జిల్లాకు కనీసం 75 మెడల్స్ వచ్చేలా క్రీడాకారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. సర్దార్ పటేల్ మైదానంలో నిర్వహిస్తున్న సిఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను మంగళవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభ సూచికంగా బెలూన్లను ఎగురవేసి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిఎం కప్ క్రీడా పోటీలను గ్రామ, మండల, నియోజక వర్గ స్థాయిలో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఆయా పోటీల్లో గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. 44 రకాల క్రీడల్లో జిల్లా స్థాయి పోటీలు జరుగుతున్నాయని ఇక నుంచి పోటీ మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. క్రీడాకారులు ప్రతి ఒక్కరూ బలంగా విజయం సాధిస్తామని విశ్వాసంతో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. గతేడాది ఖమ్మం జిల్లాకు రాష్ట్ర స్థాయి పోటీల్లో 47 మెడల్స్ వచ్చాయని ఈ ఏడాది 75 మెడల్స్ సాధన లక్ష్యంగా క్రీడాకారులు కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర స్థాయి సిఎం కప్ క్రీడా పోటీలకు ఖమ్మం జిల్లా నుంచి అత్యుత్తమ బృందాలను పంపేవిధంగా క్రీడా కోచ్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడా జెండాను ఎగురవేసి ప్రారంభ పోటీల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి కాసేపు వాలీబాల్ ఆడారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా యువజన క్రీడా శాఖాధికారి పి. సునీల్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధి కారిణి చైతన్యజైని, అధికారులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆ ఆడియో ఎలా లీకైంది..

**-అంతర్మథనంలో ఉద్యోగ సంఘాల నేతలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** గతంలో ఉద్యోగ సంఘాలు తమ సమస్యల పరిష్కారానికి మాత్రమే పరిమితమై పనిచేసేవి. ఇటీవల కాలంలో ఉద్యోగ సంఘాల నేతలు పదవీ విరమణ అనంతరం ప్రజాప్రతి నిధులుగా ఎన్నిక అవుతుండటం లేదా వివిధ రాజకీయ హోదాలలో పనిచేస్తుండడంతో చాలా మంది నేతలకు రాజకీయ పీఠాలపై ఆశలు మొలకెత్తాయి. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీలకు మద్దతుగా తమ వెనక ఉన్న ఉద్యోగులను నడిపించడం జరుగుతుంది. ఇప్పుడు ఖమ్మం జిల్లాలో ఏదులాపురం మున్సిపాలిటీకి సంబంధించి ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రి పొంగులేటి మాట్లాడిన ఆడియో ఒకటి సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తుంది. కాంగ్రెస్‌కు గంపగుత్తగా ఉద్యోగుల ఓట్లు వేయిస్తామని ఉద్యోగ సంఘాల నాయకులు హామీ ఇవ్వడం రాజకీయ చర్చకు దారి తీసింది. ఎక్కడలేని విధంగా ఏదులాపురం మున్సిపాలిటీలో కొందరు ఉద్యోగులు ఏదో ఆశించి ఉద్యోగులను తమ స్వప్రయోజనం కోసం పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వ విధుల్లో ఉండి ఇటీవల మంత్రికి అనుకూలంగా నినాదాలు చేసిన ఘటన కూడా చోటు చేసుకుంది. ఏకంగా పొంగులేటి నాయకత్వం వర్ధిల్లాలంటూ ప్రస్తుతం విధి నిర్వహణలో ఉన్న ఓ ప్రభుత్వ ఉద్యోగి నినదించడం చర్చనీయాంశమైంది. ఇప్పుడు తాజాగా ఆడియో లీకేజీ వెనక ఉద్యోగుల్లో ఎవరైనా ప్రభుత్వ వ్యతిరేకులు ఉన్నారా అన్న దానిపై ఉద్యోగ సంఘాల నేతలు అంతర్మథనంలో ఉన్నారు. మంత్రితో మాట్లాడిన నేతల్లో ఎవరు ఆ ఆడియోను లీక్ చేశారనే దానిపై ఇప్పుడు చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఏదులాపురం మున్సిపాలిటీ కేంద్రంగా ఉద్యోగ సంఘాల నాయకులు గడిచిన ఆరు నెలలుగా ఓ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి కాంగ్రెస్ సానుకూల కార్యక్రమాలు చేశారని బిఆర్ఎస్ ఆరోపిస్తుంది. ఈ విషయమై బిఆర్ఎస్ ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. మొత్తంగా ఆడియో ఇప్పుడు రాజకీయ చర్చకు, ఉద్యోగ సంఘాల్లో అంతర్గత చర్చకు దారి తీసింది.

# గెలుపు బాటలో పొందూరి అరుణ





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల్లో 18వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పొందూరి అరుణ గెలుపు బాటలో ఉన్నారు. బారుగూడెం శ్రీసిటీ పరిధిలో ఓటర్లు పొందూరి అరుణ వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అరుణ గెలుపు కోసం గత వారం రోజులుగా శ్రమిస్తున్నారు. బలమైన ఓటు బ్యాంక్ ఉండటం, అన్నింటికి మించి శ్రీసిటీ ఛైర్మన్ గరికపాటి వెంకట్రావు ఆశీస్సులు ఉండడంతో అరుణ గెలుపు ఖాయమైందన్న ప్రచారం జరుగుతుంది. ఇంటింటికి తిరిగి హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని అరుణ దంపతులు కోరుతున్నప్పుడు వారికి సానుకూల స్పందన లభించినట్లు కాంగ్రెస్ శ్రేణులు తెలిపారు. ఇప్పటికే ఈ వార్డులో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొంగులేటి ప్రసాదరెడ్డి, దయాకర్‌రెడ్డి తదితరులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అరుణ ప్రచారానికి తోడు కాంగ్రెస్ సంక్షేమ పథకాలు ఆమె విజయానికి బాసటగా నిలవనున్నాయి. బుధవారం జరిగే పోలింగ్‌లో తనకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అరుణ విజ్ఞప్తి చేశారు. బారుగూడెం శ్రీసిటీలో ఉన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, ఇందిరమ్మ ఇండ్ల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆమె హామీ ఇస్తున్నారు. మొత్తంగా ఏదులాపురం మున్సిపాలిటీలో 32 వార్డులు ఉండగా పొందూరి అరుణకు అత్యధిక మెజార్టీ లభించే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

## ఉద్యోగ సంఘాల నేతలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను ప్రభావితం చేసే పనిలో ఉన్న ఉద్యోగ సంఘాల నేతలపై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి బిఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధమని మంత్రి పొంగులేటిపై తక్షణం చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల నేతలను విధుల నుంచి తప్పించాలని వారు కోరారు. ఇందుకు సంబంధించి సమగ్ర విచారణ జరిపించాలని కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో జిల్లా అధ్యక్షులు తాతా మధు, మాజీ ఎంఎల్ఎ బానోత్ చంద్రావతి, బిఆర్ఎస్ నాయకులు కూరాకుల నాగభూషణం, బిచ్చాల తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



**ప్రజాపక్షం/ఏన్కూరు :** ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని జంగాల కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. సద్గుర్తి రాజశేఖర్ (40) తన ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించే లోగా అతను మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో స్థానిక ఎస్ఐ సంధ్య ఘటన స్థలంకు చేరుకుని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు రాజశేఖర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

# ఎన్నికల పర్యవేక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**-పోలింగ్ సరళి పరిశీలనకు కలెక్టరేట్‌లో ఐదు స్క్రీన్లు**
**-జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మశ్రీ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మున్సిపల్ ఎన్నికల పర్యవేక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్‌ను మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఐదు మున్సిపాలిటీలకు సంబంధించి 117 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సిసి కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు మున్సిపాలిటీకి ఒకటి చొప్పున కలెక్టరేట్‌లో ఐదు స్క్రీన్లు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు పనిచేస్తున్నాయో లేవో చివరిగా క్రాస్ చెకింగ్ చేసుకోవాలని డిఆర్‌వో సంబంధిత అధికారులకు సూచించారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సర్వజ్ఞ విద్యార్థులు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ విద్యార్థులు జాతీయ స్థాయి ఫిస్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించని ఫిస్ట్‌బాల్ పోటీల్లో సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు శ్యామ్, అనంత శేఖర్‌రెడ్డి, మనీష్, జశ్వంత్ సాయి, రితిక్ చంద్ర అత్యుత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. శేఖర్‌రెడ్డి, శ్యామ్‌లు పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, మనీష్, జశ్వంత్ సాయి, రితిక్ చంద్ర తమిళనాడులో జరిగే పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్, డైరెక్టర్ నీలిమ లు మెరీట్ సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. తమ పాఠశాలలో చదువుతో పాటు విద్యార్థులు అన్ని రంగాలలో రాణించేందుకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చూపి జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని తెలిపారు. విద్యార్థులు, కోచ్‌లు, తల్లిదండ్రులకు పాఠశాల తరుపున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, కోచ్‌లు పాల్గొన్నారు.

# కల్లంలో మిర్చి దొంగతనం

**-వరుస చోరీలతో రైతుల ఆందోళన**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం:** కల్లాల్లో ఆరబోసిన మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని చిమ్మపుడి ప్రాంతంలో వరుసగా కల్లాల్లో ఆరబోసిన మిర్చిని దొంగిలిస్తున్నారు. చిమ్మపుడి గ్రామానికి చెందిన రైతు జోనబోయిన పాపయ్య ఐదు ఎకరాల మిర్చి సాగు చేశాడు. పాపటపల్లి రోడ్డులోని తన చేను వద్దనే మిర్చిని ఏరి కల్లంలో ఆరబోశాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కల్లంలో కుప్పగా పోసిన మిర్చిని దొంగిలించారు. సుమారు ఎనిమిది క్వింటాళ్లకు పైగా మిర్చిని దొంగిలించారని రైతు పాపయ్య తెలిపారు. మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారని ఆ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మిర్చి ధర ఆశాజనకంగా ఉండడంతో మిర్చి దొంగతనంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో గ్రామాల్లో పోలీసులు గస్తీ పెంచి మిర్చి దొంగతనానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.